# జెలసీ

-నిర్మల.కె.రావు

**నా వ్యసనాలలో ముఖ్యమైనవి ఆలోచనలు. అవి నా నేస్తాలే కాదు. నా వూపిరి. నా శరీరంలోని ప్రతి అణువూ నా ఆలోచనలతో వూపిరి పోసుకుని జీవిస్తున్నవే! ఆలోచనలకు రమ్యమైన రంగులు అద్ది, కుంచెలతో అందమైన రూపాల మాలలల్లి జీవించడం నా ప్రవృత్తి. ఆలోచనలను ఆకర్షణీయంగా చిత్రించడం నా వృత్తి!**

అందువలననే కావచ్చు ఈ స్థితిలో కూడా నా మెదడు ఆలోచిస్తోంది. ప్రస్తుతం నేను చెయ్యగల పని అది ఒక్కటే. మరేం చేద్దామన్నా చేతులకు, కాళ్ళకు బ్యాండేజీలు, సెలైనుబాటిలు అడ్డం వస్తున్నాయి. మెడ ఎముకకు గట్టి దెబ్బ తగలటంతో, దాన్ని కూడా కదల్చ లేకపోతున్నాను. శరీరం నిర్జీవంగా వున్నా, మెదడు మాత్రం సజీవ స్రవంతిలా పనిచేస్తోంది. నాకు యాక్సిడెంట్ జరిగి మూడు నాలుగు రోజులై వుంటుంది!

చిన్నగా అలికిడి వినిపిస్తే కళ్ళు తెరిచాను.

ఎదురుగా నీరజ! ఆమెను చూస్తే ఆశ్చర్యం వేసింది!

కలువలలాంటి ఆ కళ్ళని చూస్తే నీటిలోని కలువలలోకి నీరొచ్చేసిందే అన్నట్టున్నాయి. చిలిపిగా నవ్వే పెదవులకు స్వేచ్ఛనివ్వకుండా పంటితో బిగించి పట్టుకుని నావైపే జాలిగా చూస్తోంది. పాపం ఆ పెదవులని చూస్తే జాలిగా వుంది.

పలకరింపుగా నవ్వాను.

నెమ్మదిగా గొంతు పెగుల్చుకొని ఏదో అనబోయి ''ఇప్పుడెలా వుంది'' అని అడిగింది.

ఫర్వాలేదన్నట్లు తలవూపి, కూర్చోమన్నట్లు సైగ చేశాను. నీరజ కళ్ళలోని నీరు చెంపలపై కారకుండా ప్రయత్నంపై బిగపట్టుకుంటోంది. ఎదుటి మనిషి మొహంలోని ఫీలింగ్స్‌ని బట్టి వారి ఆలోచనలను అంచనా వెయ్యటం నా హాబీ. ఆమె బాధపడుతుంటే నాకు ఇంకా చాలా బాధగా వుంది.

నీరజ దుఃఖాన్ని నేను భరించలేకపోతున్నాను. ఆమె బాధ నా గుండెను కోసేస్తోంది. నాకోసం ఆ అమాయకురాలు బాధపడటం నాకు భయం కలిగిస్తోంది. ఆ కళ్ళలోని సిన్సియారిటీ, ఆ బాధలోని నిజాయితీ నాపై నేను అసహ్యించుకునేలా చేస్తున్నాయి.

నా ప్రస్తుత స్థితికి ఆమె ఏమాత్రం కారణం కాకపోయినా, నీరజ సిన్సియర్‌గా ఫీలవుతోంది. కాని ఆమె ప్రస్తుత పరిస్థితికి నేను మాత్రమే కారణం. ఆ నిజం నన్ను దొలిచేస్తూ బాధపెడుతోంది.

నీరజ నా అభిమాని. నాకున్న ఎందరో అభిమానుల్లోని ప్రత్యేకమైన వ్యక్తి నా ప్రియ శిష్యురాలు.

నేనామెను మొదటిసారి కలసిన రోజు నాకింకా జ్ఞాపకమే!

ఆరోజు కళాభవన్‌లో...

★★★

కళాభవన్‌లో నా చిత్ర ప్రదర్శన జరుగుతోంది. నేనూ అక్కడే వున్నాను. ఆ పెద్ద హాల్లో 'ఆమె' నన్నెంతో ఆకర్షించింది.

ఆమె ప్రక్కగా వెళ్ళి 'హలో' అన్నాను. తలతిప్పి నావైపు ఏమిటన్నట్లుగా చూసింది.

''నాపేరు వప్నామిత్ర''

ఆమె మొహంలో నేనాశించిన రియాక్షన్ కనిపించలేదు.

''శతమన్యు పేరుతో పెయింటింగ్స్ వేస్తూ వుంటాను'' మళ్ళీ నేనే చెప్పాను.

ఆమెలో అప్పుడు కనిపించింది నేనాశించిన రియాక్షన్! ఆనందం, ఆశ్చర్యం, పట్టరాని సంతోషం లాటి చెప్పలేని ఎన్నో భావాలు మిళితమైన ఆహ్లాదకరమైన ఎక్స్‌ప్రెషన్! ఒక కళాకారుడు ఎదుటి వ్యక్తి నుండి ఆశించే రమ్యమైన ఫీలింగ్ అది, నాకెంతో ఆనందం కలిగింది!

అలా పరిచయమైన నీరజ, మూడు సంవత్సరాలలో నా అభిమాని స్థానం నుంచి ఆత్మీయురాలి స్థానంలోకి వచ్చేసింది.

నా ఆలోచనలకు నీరజ ఊహలు తోడయ్యేవి. నా వూహలకి ఆమె అందమైన భావాల రంగులద్దేది. నా కుంచె నుంచి విరిసిన ప్రతి రంగుని మెచ్చుకోవటం నుంచి, ఆ రంగులకి మరో మిశ్రమం తోడయితే బావుంటుందని సలహాలిచ్చేది.

ఒకరోజు ''మాష్టారూ, నాక్కూడా పెయింటింగ్స్ వెయ్యటం నేర్పరూ'' అని అడిగింది నీరజ. మా స్నేహం పెరిగి ఎన్ని రోజులు గడిచినా, నన్ను 'మాష్టారూ' అని అనటం మాత్రం మానదు నీరజ. ఆమె కోరిక నాకెంతో ఆనందం కలిగించింది.

చిన్నతనంలో లెక్కల్లో నూటికి నూరు మార్కులు తెచ్చుకోకుండా, పెయింటింగులంటూ సమయాన్ని వృధా చేశానని కోప్పడిన తల్లిదండ్రులు, యవ్వనంలో నా జీవితంలో తనదైన సగభాగాన్ని తనకి కాకుండా నా చిత్రకళకి ఖర్చు చేస్తానని నా అర్థాంగి...నావలన సృష్టిలోకి వచ్చినా తమకి దక్కవలసిన నా ప్రేమానురాగాలు, నాచే సృష్టించబడిన నా పెయింటింగ్సుకే దక్కుతున్నాయని నా పిల్లలు...వారితో గడపవలసిన సమయాన్ని కుంచెలతోనూ, కాన్వాసులతోనూ గడుపుతానని నా స్నేహితులు-ఇలా నా చుట్టూ వుండే వారందరూ నాకు మానసికంగా దూరమయ్యారు. వారందరూ చూసే చూపులు నాలో ఒక రకమైన నిస్తేజాన్ని కలిగించాయి. మానసికంగా ఒంటరితనంతో గడిపే నాకు నీరజ స్నేహమే వూరట నిచ్చేది. తనకు పెయింటింగ్స్‌పై వున్న యింటరెస్ట్‌తో, నాలో పేరుకుపోయిన నిర్లిప్తతను కరిగించింది, నా ప్రియ నేస్తం!

చిన్న మెళుకువ చెప్తే దాన్నుంచి అల్లుకుపోయే నేర్పువుంది నీరజలో. ఆమెకు చిత్రలేఖనం నేర్పటం శ్రమగా కాక ఎంతో ఆహ్లాదంగా వుండేది. నేర్చుకొనే నీరజ శ్రద్ధకన్నా, ఆమెకు నేర్పటంలో నాకే ఎక్కువ శ్రద్ధ, ఆసక్తి వుండేవి.

మొదట్లో నా చిత్రాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్స్‌లోనే, నీరజ పెయింటింగ్స్‌ను కూడా పెట్టమనేవాడిని. తర్వాత ఆమె చిత్రాలను ప్రదర్శించడం కోసం ఏర్పాటు చేసిన ప్రదర్శనలలో, నా చిత్రాలను కూడా వుంచటం ప్రారంభమైనది. ఆ తర్వాత ఆమె పెయింటింగ్సును మాత్రమే ప్రదర్శించటానికి నా చిత్రాలను ప్రక్కకు జరపటం మొదలు పెట్టారు. ఇవన్నీ నా ప్రమేయం లేకుండా పరిణామక్రమంలా అలా జరిగిపోయాయి.

నా పెయింటింగ్స్ గురించి నాతో ఓ గంట మాట్లాడటం కంటే, ఆ సమయంలో తాను పెయింటింగ్స్ చేసుకోవటమే నీరజకు ఆనందాన్నివ్వడం మొదలైంది. నెమ్మదిగా నీరజ అభివృద్ధిని నేను ఎంజాయ్ చెయ్యలేకపోయేవాడిని. తను మాత్రం మునపటికంటే ఆత్మీయంగా, 'మాష్టారూ' అంటూ ఎంతో గౌరవంగానే ప్రవర్తించేది.

తాను నారుపోసి, నీరుపోసి పెంచిన మొక్క, మహావృక్షమైపోతుంటే, ఆ నారుపోసిన వాడు మహదానందపడిపోతాడు. కానీ విషయంలో మాత్రం నా చేతులతో రూపు దిద్దుకున్న చిత్రం, నన్నుమించి ఎదిగిపోతుంటే నిజం చెప్పొద్దూ నేను మనస్ఫూర్తిగా ఆనందించలేక పోయాను. నాలోని మనిషికి, కళాకారుడికి మధ్య ఘర్షణ మొదలయ్యింది. మామూలు మనిషిగా ఆమె అభివృద్ధిని ఆనందించాలని వున్నా, నాలోని కళాకారుడు సుతరామూ అందుకు ఒప్పుకోవటం లేదు!

కళాకారుడికి వుండకూడని, రాకూడని ఫీలింగ్ అసూయ! వుండకూడని ఫీలింగ్స్ వుండటమే మనిషి మనసంటే!

ఎంత కంట్రోల్ చేసుకున్నా అసూయ నన్ను తినేస్తోంది. నా మనస్సులోని సంఘర్షణ, నా కుంచెపై ప్రభావం చూపించటం ప్రారంభించింది. నేను వెయ్యాల్సిన చిత్రాల గురించికంటే, నీరజ ప్రగతిని గురించి ఆలోచించటంతో, నా స్వాభివృద్ధి కుంటుపడింది. నీరజపై నాకున్న ఆప్యాయతను, ఆత్మీయతను, జెలసీ డామినేట్ చెయ్యటం మొదలుపెట్టింది. మా ఆలోచనా

ధోరణిలో అదో విధమైన శూన్యం చోటు చేసుకుంది.

నీరజ మాత్రం నా అభివృద్ధిని మనస్ఫూర్తిగా ఆకాంక్షించేది. ఎక్కడ ఆర్ట్ ఎగ్జిబిషన్లు పెట్టినా, ఏ పోటీలు జరిగినా 'మాష్టారూ! బహుమతి మీకే రావాలి' అంటూ వుండేది. ఒకసారి ఇంటర్ స్టేట్ లెవల్ పెయింటింగ్ పోటీలు వున్నాయంటూ పేపర్ కటింగ్ పట్టుకొని వచ్చింది.

''మాష్టారూ! ఇది చాలా ప్రతిష్టాకరమైన పోటీ. ఆలిండియా లెవల్లో గొప్ప గుర్తింపు వస్తుంది. ఈ పోటీలో బహుమతి పొందిన చిత్రాన్ని అంతర్జాతీయ చిత్ర ప్రదర్శనలో ప్రదర్శిస్తారట. మీరు చాలా మంచి చిత్రం వెయ్యాలి'' అంది. నాకు ఆ రోజే ఆ పోటీకి ఆహ్వానం అందింది. నా స్టూడియోలోకి ఆమె వస్తే, నేను నిర్మించుకున్న సామ్రాజ్యంలోకి, శత్రు సామ్రాజ్యపు చక్రవర్తి దూసుకొచ్చినట్లు ఫీలయ్యేవాడిని. ఆమె ప్రోత్సాహం నేను భరించలేని వెక్కిరింతలా వినపడింది.

ఆమె అన్నదని కాక, నేను చాలా మంచి చిత్రం గీయాలి. కూలిపోతున్న నా ఆత్మవిశ్వాసం నిలబడాలంటే, ఆ బహుమతి నాకే రావాలి. చెదిరిపోతున్న నా మనస్థైర్యం తిరిగి పొందాలంటే నేను విజయం సాధించాలి. అహోరాత్రులు, అకుంఠిత దీక్షతో చాలా సిన్సియర్‌గా కష్టపడి, 'నా దృష్టిలో' అద్భుతమైన పెయింటింగ్ వేశాను. అది నా జీవితంలోనే 'మాస్టర్‌పీస్' అవుతుందనుకున్నాను.

ఊపిరి తీసుకోవటం కూడా మర్చిపోయే టెన్షన్ అనుభవించాను. నేనెంతో ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. నేను ఆశించినట్లుకాక, నేను భయపడిన ఫలితమే ఎదురయ్యింది! నీరజ చిత్రానికి మొదటి బహుమతి, నా పెయింటింగ్‌కి జ్యూరీస్ స్పెషల్ బహుమతి లభించాయి. జడ్జీలు నలుగురు. కాని సందర్శకులు నాలుగువేలమంది. ఆ నాలుగువేలమంది నీరజ చిత్రం బావున్నదంటే, కేవలం నలుగురు జడ్జీలు మాత్రం నా చిత్రాన్ని మెచ్చుకున్నారు. ఆ మాట ఎవరూ అనకపోయినా అంతర్లీనంగా వారి భావన అదే!

నా హృదయం రగిలిపోయింది. అగ్నికి ఆజ్యం తోడయినట్లుగా ఆ బహుమతిని నా చేతులమీదుగా అందుకుంటానంది నీరజ.

నాకు చెందవలసిన నా వస్తువును బలవంతంగా నీరజకు నేనే అందచెయ్యవలసి వచ్చింది. బహుమతి తీసుకోవటానికి ఎక్కవలసిన స్టేజి, బహుమతి యివ్వటానికి ఎక్కటం గర్వించదగ్గ విషయం. కాని నాకు మాత్రం అవమానంగా తోచింది.

నాలో రేగుతున్న ఘర్షణను బయటపడనీయకుండా, నీరజ గురించి నాలుగు మాటలు మాట్లాడి దిగి వచ్చేశాను. ఆమె నా స్టూడెంట్ అని తెల్సుకున్నాక అందరూ నన్ను అభినందించసాగారు. గురువును మించి శిష్యుడు ఎదిగితే, అది గురువుకు గర్వకారణమట! చిత్రంగా నాకలా అనిపించట్లేదు! నాకు కావలసినది చిత్రకారునికి గుర్తింపు కీర్తి! అంతేకాని ఒక గురువుగా కాదు. నా వృత్తి పెయింటింగ్, కాని టీచింగ్‌కాదు! ప్రతి మనిషి జీవితంలో తను నేర్చుకున్నది ఇతరులకు నేర్పటం గౌరవంగా భావించాలి. కాని ఆ క్షణం నాకు అవేవి గుర్తురాలేదు.



సభ ముగిసింది. అంతర్సంఘర్షణతో నా మెదడు వేడెక్కి కుతకుతలాడిపోతోంది. అన్యమనస్కంగా కారు దగ్గరికి నడిచాను. అంతవరకు నాతోనే వున్న నీరజ 'వెళ్ళొస్తాను మాష్టారు' అంది.

''ఎక్కడికి?'' అన్నాను.

''ఇంటికే'' అంది.

''ఎలా వెళతావు ఒక్కదానివే వున్నావుగా'' అంటే

''ఆటోలో వెళ్ళిపోతాను'' అంది.

అక్కడి నుంచి నీరజ యిల్లు చాలా దూరం. ఆమెనలా పంపటానికి మనస్కరించలేదు.

''ఇన్నాళ్ళయినా నా దగ్గర నీకు చనువు రాలేదేరా! యింటి దగ్గర డ్రాప్ చెయ్యమని అడగొచ్చుగా'' అనే నా మాటలు నాకే ఆశ్చర్యమనిపించాయి. అంత మనస్ఫూర్తిగా ఎలా మాట్లాడగలిగానో నాకే ఆ క్షణం అర్థం కాలేదు. అదే మనిషిలోని ద్వంద్వ ప్రకృతి.

నీరజ మొహమాటంగా నవ్వింది. ముందుసీట్లో పెయింటింగ్స్ బహుమతులు వున్నాయి. వాటిని మార్చటం దేనికని, నీరజను వెనుక సీట్లో కూర్చోమన్నాను.

నీరజ వెనక డోర్ తీస్తుంటే ''జాగ్రత్తమ్మా! డోర్ సరిగ్గా లేదు. విసురుగా పడుతోంది'' బాధ్యతగా హెచ్చరించాను. దాని హేండిల్ కూడా సరిగా లేదు.

మౌనంగా డ్రయివ్ చెయ్యసాగాను. మౌనానికే మాటలొస్తే ఆక్షణాన నా మనసులోని భావాలకి ఏమని భాష్యం చెప్పి వుండేదో?

వెనకసీట్లోని నీరజ కళ్ళలోని ఆనందపుకాంతి నా

గుండెను మండిస్తోంది. అంతరాత్మ. అహాన్ని ఎగదోస్తున్నా, వివేకం సంస్కారాన్ని వదలనంటోంది...అదే చిత్రం!

పర్సనల్‌గా నీరజ స్నేహం నాకు ఎంతో ఆనందం కలిగిస్తోంది. కాని నా రంగంలో ఆమె వునికి, నా అస్థిత్వానికే దెబ్బ. ప్రతి కళాకారుడూ ఎప్పుడో అప్పుడు యిటువంటి పరిస్థితి ఎదుర్కోవలసి వుంటుంది. దాన్ని ఎదిరించి విజయం సాధించిన వాళ్ళే, తమ స్థానాన్ని సుస్థిరపరచుకోగలుగుతారు. మానసికంగా బలహీనమైనవాళ్ళు పతనమవుతారు.

నాలోని భావ సంఘర్షణని తట్టుకోలేక పోతున్నాను. నా ఆలోచనలకు ప్రతిరూపంగా ట్రాఫిక్ లైటు డేంజర్ సిగ్నల్‌ని చూపించింది. ఆలోచనల నుండి తేరుకొని కారు ఆపాను.

''సారూ! ధర్మం చెయ్యండి...సారూ'' అంటూ ఓ బిచ్చగాడు కారులోకి చెయ్యి పెట్టాడు. చిన్నతనం నుండి బీదరికం వలన, ఆరోగ్యం గురించి ఎటువంటి శ్రద్ధ తీసుకోలేదు. ఆ చేతిని చూస్తే ఒళ్ళు జలదరించింది. లెప్రసీకి గురై ఆ చెయ్యి వేళ్ళు లేక మొండిగా వుంది. దాన్ని ఎక్కువ సేపు నా దృష్టిపథంలో వుంచటం యిష్టంలేదు. గబుక్కున జేబులో నుంచి చేతికందిన చిల్లర తీసి వేశాను. అతను వెళ్ళిపోయినా, ఆ చెయ్యి మాత్రం నా కళ్ళముందు నుంచి తప్పుకోలేదు.

వేళ్ళులేని మొండి చెయ్యి...!

ఆ వూహకే నా శరీరం సన్నగా కంపించింది. నాలోని 'హైడ్' మేల్కొన్నాడు. నావూహలకి చక్కగా రూపకల్పన చేసి జీవంపోస్తే, అవి అభివృద్ధికి దోహదపడతాయి. కాని ఆ క్షణం నామదిలో మెదిలిన వూహకు జీవం పోస్తే జరిగేది అభివృద్ధి కాదు...విధ్వంసం!

ట్రాఫిక్ సిగ్నల్ ఆకుపచ్చరంగు చూపించటంతో కారు ముందుకు పోనిచ్చాను. ఆలోచన ఒక్కక్షణమే అయినా మెదడులో నరాలు చిట్లి పోతున్నంత ఫీలింగ్. తలంతా దిమ్ముగా అయిపోయింది. రోడ్డుప్రక్కకు తీసుకొని కారు స్లో చేశాను.


''నీరజా, ఆ షాపులో సిగరెట్లు తెచ్చిపెడ్తావా?'' పర్సులోనుంచి డబ్బు తీస్తూ అడిగాను. నాకు సిగరెట్లు కొని తేవటం తనకలవాటే. డబ్బులు తీసుకొని దిగి వెళ్ళింది.

మనిషి సిట్యుయేషన్‌కి లొంగిపోతే, అపజయం అతన్ని సాధిస్తుంది. సిట్యుయేషన్ని లొంగదీసుకుంటే, విజయం అతన్ని వరిస్తుంది. ఆక్షణాన నేను ఆ సందర్భానికి పూర్తిగా లొంగిపోయాను. జెలసీ నాలోని విచక్షణా జ్ఞానాన్ని చంపేసింది.

నీరజ సిగరెట్లు తీసుకొని తిరిగివస్తోంది.

క్షణక్షణానికి నాలో టెన్షన్ పెరిగిపోతోంది. మనస్సు అట్టడుగుపొరల్లో నిద్రాణమైన క్రూరత్వం మేల్కొంది. నాలోని యుక్తాయుక్త విచక్షణ ఎప్పుడో పోయింది.

నీరజ కారుని సమీపిస్తోంది. నా గుండె చప్పుడు, నాకే భయంకరంగా వినిపిస్తోంది.




నాకు సిగరెట్ ప్యాకెట్ యిచ్చి, వెనక్కు తిరిగి కారులో కూర్చోవటానికి, తీసివున్న డోర్ వైపు చెయ్యి చాచింది.

చివరి క్షణం...నాలో అంతర్మథనం...

తప్పు, తప్పు, తప్పని, వద్దు, వద్దు, వద్దని నా హృదయం నన్ను హెచ్చరిస్తూనే వుంది. కానీ నా మనస్సు వినటం లేదు.

ఒకే ఒక్క స్ప్లిట్ సెకండ్!

చిన్న జర్క్‌తో కారుని ముందుకు పోనిచ్చాను.

''కెవ్వు''మన్న కేకతో, ఒక్కసారిగా బలమంత వుపయోగించి బ్రేక్‌పై కాలు పెట్టి నొక్కాను. బలమైన అంబాసిడర్ కారు తలుపుల మధ్యన మృదువైన నీరజ చెయ్యి! హ్యాండిల్ సరిగ్గా లేక వేళ్ళతో తలుపు తీయబోయింది నీరజ! తెల్లటి కాన్వాసుపై , ఎర్రటి రంగు స్ప్రే చేసినట్లు, కారుపై రుధిర ధారలు. నీరజ కళ్ళలోని నీరు, నాలో నిద్రపోతున్న మానవత్వాన్ని తట్టి లేపింది.

''ఏమయిందిరా!'' నా గొంతులో తడబాటు, తెలియరాని వణుకు. ఆమె చేతి నుండి కారుతున్న రక్తం, నా మనస్సులోని అసూయను ప్రక్షాళన చేసింది. నాలో మేల్కొన్న హైడ్ చచ్చిపోయాడు. జేబులోనుంచి రుమాలు తీసి చుట్టాను.

''మాష్టారూ, నొప్పి'' అంటూ నా భుజంపై స్పృహ తప్పిపడిపోయింది నీరజ. నాకంటి నుంచి కారే కన్నీటి ధారలు, ఆమె చేతిపైని రక్తాన్ని ఏమాత్రం కడగలేకపోయాయి. నేను చేసిన పనిని విశ్లేషించుకోవటానికి ఆ నిమిషం నామెదడు పని చెయ్యలేదు.

ఆ క్షణాన నాలో కలిగిన భావాన్ని కేవలం 'పశ్చాత్తాపం' అంటే సరిపోదు.

స్పృహలేని నీరజని హాస్పిటల్‌లో చేర్చాను. వాళ్ళ యింట్లో కబురు చేసి చెదిరిన మనస్సుతో ఇంటికి బయలుదేరాను. అన్యమనస్కంగా డ్రయివ్ చేస్తున్నాను. నాలోని కళాకారుని ముందు మనిషిగా చచ్చిపోయాను. కన్నీటితో మసకబారిన కంటికి, ఎదురుగా వచ్చే లారీహెడ్‌లైట్లు నక్షత్రాల్లా కన్పించాయి. మరుక్షణాన కంట్లోకి సూటిగా పడుతున్న వెలుతురుని చూడలేక కళ్ళు మూసుకున్నాను.

కళ్ళు తెరిచేసరికి, ఒంటినిండా కట్లతో బెడ్‌పై పడివున్నాను.

★★★

''నాకే ప్రమాదం జరిగిందంటే, మీకెంత ప్రమాదం జరిగింది మాష్టారూ!'' అన్న నీరజ మాటలతో ఆలోచనల నుంచి తేరుకున్నాను.

''పోనీలెండి, యిలాగైనా హాయిగా నెలరోజులపాటు రెస్టుతీసుకోండి.'' నాకు ధైర్యం చెప్తున్నట్లుగా అంది.

''నెలేమిటి నీరజా, నాకు ఇక జీవితాంతం రెస్టే'' నిస్తేజంగా అన్నాను.

''అలా అంటే ఎలా మాష్టారూ! జీవితంలో జరిగే చిన్నచిన్న ప్రమాదాలకే బెంబేలు పడిపోతే ఎలా? నా విషయమే తీసుకోండి....''

ఒక్క క్షణం ఆగి, తిరిగి నెమ్మదిగా

''ఇకముందు పెయింటింగ్‌నే వృత్తిగా చేసుకొని బ్రతుకుదామనుకున్నాను. కాన్వాసుని నింపే వూహలున్నా, కుంచెపట్టుకుందుకు వేళ్ళే లేవు. అయినా ఎంచక్కా హాయిగా బ్రతకాలనుకోవటం లేదూ!''

''జరిగింది చిన్న ప్రమాదమైతే అలాగే అనుకోనే వాణ్ణి! నువ్వు పెయింటింగుని వృత్తిగా చేసుకుందాం..అనుకున్నావు అంతే, కాని నా వృత్తి, ప్రవృత్తి, జీవనాధారం అన్నీ పెయింటింగే! ప్రమాదంలో నీకు పోయినవి కుడిచేతి వేళ్ళు మాత్రమే! నాకో..వెన్నెముక దెబ్బతింది. జీవితాంతం ప్రాణం వున్నా, చలనం లేని కట్టెను నేను'' నిర్లిప్తంగా అన్నాను. నీరజ బిత్తరపోయింది.

''వెర్రిరా! నీ జీవితాన్ని ఫ్రెష్‌గా ప్రారంభించు. నీకు లేనివి ఐదువేళ్ళు. కాని వున్నవీ...ఐదు వేళ్ళే అని గుర్తుంచుకో'' చిరునవ్వుతో చెప్పాను.

కాని మనస్సులో ''ఐయాం సారీ నీరజ! నాకు జరిగింది ప్రమాదమే అయినా నీకు జరిగింది ప్రమాదం కాదు. అసూయతో నీ శరీరంలోని చిన్న భాగాన్ని లేకుండా చెయ్యాలనుకున్న పాపానికి, నాశరీరంలోని పెద్దభాగాన్నే వుండీ లేకుండా చేశాడు భగవంతుడు. ఏ ఖ్యాతికైతే నువ్వు నాకు పోటీ అనుకున్నానో, ఆ ఖ్యాతి నీకే దక్కటానికి, నన్నే పోటీ నుంచి తొలగించాడు!'' అనుకున్నాను.

నా మనస్సులోని చీకటి కోణాన్ని ఆ క్షణంలో కూడా నీరజకు చూపించలేకపోయాను. నేను చేసిన తప్పు నన్ను క్షమాపణ సైతం అడగలేని స్థితికి దిగజార్చింది.

నీరజ...నా నీరజ

నా అభిమాని, ఆత్మీయురాలు, స్నేహితురాలు.

మా రంగంలో ఎందరో వున్నా తాను మాత్రమే నాకు పోటీ అనిపించేలా చేసిన ప్రతిభావంతురాలు.

నా కళ ద్వారా నాకు లభించిన నా చిన్నారి నేస్తం! చేయరాని తప్పు చేసి నేను కోల్పోయిన నా నేస్తం!

నా ప్రియనేస్తం! నన్ను క్షమించకు! ఎప్పటికీ.....

నా మనసు ఆక్రోశిస్తోంది!

★